క్లుప్తంగా

పొంగుతున్న నిర్లక్ష్యం



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు మ్యాన్‌హోల్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పలు ప్రధాన కూడళ్లలో, కమర్షియల్ ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ పొంగిపోర్లుతున్నాయి. ఫలితంగా రోడ్డుపై పెద్ద ఎత్తున్న మురుగు పారడంతో చుట్టుపక్కల వారికి, వాహనదారులు దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులు స్పందించి నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

పెట్రోలు లూజు విక్రయాలు వద్దు



గుంటూరు ఈస్ట్: అరండల్‌పేట స్టేషన్ పరిధిలోని పెట్రోల్‌బంక్‌లకు బాటిల్స్‌లో అమ్మకాలు చేయవద్దని ఆదివారం అరండ్‌పేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర రెడ్డి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 10వ తేదీ వరకు అన్ని పెట్రోల్ బంక్‌లలో లూజు విక్రయాలు చేయవద్దన్నారు. క్యాన్‌లలో, బాటిల్స్‌లలో పెట్రోలు పోయడం నిషేధించబడిందన్నారు. వాహనాలలో మాత్రమే పెట్రోలు పోయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివాదాలకు దూరంగా ఉండాలి



కాకుమాను: ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎస్.రవీంద్ర అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీ షీటర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. షీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రతి రోజు కట్టుదిట్టమైన నిఘా పెట్టినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే కొంత కాలనికి షీటు తీసే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ దీనిని గమనించి మసులుకోవాలని స్పష్టం చేశారు.

పొంగుతున్న నిర్లక్ష్యం



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు మ్యాన్‌హోల్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పలు ప్రధాన కూడళ్లలో, కమర్షియల్ ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ పొంగిపోర్లుతున్నాయి. ఫలితంగా రోడ్డుపై పెద్ద ఎత్తున్న మురుగు పారడంతో చుట్టుపక్కల వారికి, వాహనదారులు దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులు స్పందించి నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

కార్మెల్ మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలుప్రాంతాలనుంచి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పొద్దుటూరు, దర్శి, ధర్మవరం, కర్నూలు, మార్కాపురం ప్రాంతాలను పలు వాహనాలు, రైళ్లలో తరలి వచ్చారు. కొండ ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్‌మాత మందిరంలో కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

హలో.. ఏంటీ పరిస్థితి?

- పార్టీ అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఆరా
- ఎక్కడ చూసినా ఇదే చర్చ
- కూడికలు, తీసివేతల్లో శ్రేణుల నిమగ్నం
- లెక్కలు, అంచనాల్లో తలమునకలు



నెహ్రూనగర్: ''హలో.. మాస్టారు.. ఏంటి పరిస్థితి? మీ దగ్గర ఎవరు గెలుస్తారు? ఎన్ని ఓట్ల మెజార్టీ వస్తుందనుకుంటున్నారు? అవతల పార్టీ అభ్యర్థికి ఎన్ని పడుంటాయ్? అయితే మన పార్టీ క్యాండిడేట్ గెలుపు గ్యారంటీ అన్న మాట. అది సరే.. స్టేట్‌లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనుకుంటున్నారు? నీకున్న సమాచారం ఓ సారి చెప్పు..'' ఇద్దరు వ్యక్తుల ఫోన్ సంభాషణ ఇది. పోలింగ్ ముగిశాక నేడు అభ్యర్థులు, పార్టీల గెలుపోటములపైనే అందరి దృష్టి ఉంది. ఏ ఇద్దరు కలిసినా సర్వత్రా ఇదే చర్చ కనిపిస్తోంది.

- అంతేకాదు.. ఎక్కడెక్కడో ఉన్న వారు సైతం తమ స్నేహితులు, బంధువులకు ఫోన్లు చేసి ఎన్నికల ఫలితాలెలా ఉంటాయన్న దానిపైనే మాట్లాడుకుంటున్నారు. సాధారణ ప్రజలకంటే ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు వీటిపైన మరింతగా చర్చించుకుంటున్నారు. ఆయా పార్టీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పోలై ఉంటాయి? వాటిలో గెలుపు అంశాలు ఎంత వరకు ఉంటాయన్న దానిపై బేరిజు వేసుకుంటున్నారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, యువకులు ఎవరికి వేశారోనని ఆరా తీస్తున్నారు. దానిని బట్టి ఫలానా అభ్యర్థి/పార్టీ గెలుస్తుందని, లేదా ఓటమి పాలవుతారని అంచనాకొస్తున్నారు. ఇలా కూడికలు, తీసివేతల్లో నిమగ్నమై ఉన్నారు. లెక్కలు, అంచనాల్లో తలమునకలై ఉన్నారు.
- మరోవైపు టీవీల్లోను, సోషల్ మీడియాలోను, యూట్యూబ్ చానల్స్‌లోనూ ఇప్పటికే అనధికారికంగా ఎగ్జిట్ పోల్స్ పేరిట ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయన్నది జోస్యం చెప్పేస్తున్నారు. ఆయా పార్టీ శ్రేణులు, రాజకీయాలపై ఆసక్తి ఉన్నవారు వీటిని ఎక్కువగా వీక్షిస్తున్నారు.
- పెద్ద ఎత్తున జరిగిన మహిళా ఓటింగ్, వృద్ధుల ఓటింగ్‌తో వైఎస్సార్ సీపీదే గెలుపంటూ సర్వత్రా చర్చ జరుగుతుండగా ..మరోవైపు పోలింగ్‌కు ముందు కూటమి అభ్యర్థులదే గెలుపంటూ పందెల కోసం హడావుడి చేసిన వారు ఇప్పుడు వెనక్కి తగ్గారు. తొలుత 1:2,3 బెట్టింగులకు సిద్ధమన్న వారిప్పుడు 1:1కి కూడా ముందుకు రావడం లేదు. ఏదోలా తామే అధికారంలోకి వస్తామని బీరాలు పలుకుతున్నా.. పందేల దగ్గరకు వచ్చే సరికి పలాయనం చిత్తగిస్తున్నారు. ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీ వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు



కొబ్బరికాయలు కొడుతున్న దృశ్యం

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని, వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రెడ్డి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కంజుల సత్యనారాయణరెడ్డి నిర్విరామ ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ఆదివారం మొదలైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సత్యనారాయణరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయుక్తంగా 10 లక్షల పారిజాత పుష్పాలతో తొలుత స్వామివారికి విశిష్ట అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారిని స్మరించుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల నామధేయాలు ఉచ్ఛరిస్తూ, వారిని తిరుగులేని ఆధిక్యంతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా కంజుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమం కొనసాగేందుకు వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని అన్నారు. పేదరిక నిర్మూలన జరిగి నవ సమాజ నిర్మాణం జరిగేందుకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడుతూ ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే బాధ్యతయుతమైన పౌరులుగా తాము వైఎస్సార్ సీపీ అఖండ విజయాన్ని కోరుకుంటూ పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల రోజునే కాకుండా, దీన్ని ఒక నిరంతరం ప్రక్రియగా కొనసాగిస్తామని వెల్లడించారు. నిత్య పూజాధికాలలో టి.వెంకటేశ్వరరెడ్డి, బలరామిరెడ్డి, కంజుల సూర్యకుమారి, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థానాలకు చేరగలం



ఉపకార వేతనాన్ని అందజేస్తున్న పాశం శ్రీకృష్ణ దేవరాయ యాదవ్, రాజేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుపై శ్రద్ధాసక్తులతో ముందుకెళ్లడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోగలరని కేంద్ర జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బి.రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం అమరావతిరోడ్డులోని అన్నదాన సమాజంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు పాశం రవీంద్రయాదవ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువులో రాణిస్తూ మంచి ఉన్నత స్థానానికి ఎదగాలని తెలిపారు. బద్ధకం వదులుకుని, శ్రద్ధతో చదివి మంచి భవిష్యత్తు పొందాలన్నారు. బీసీ మహాజన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభను కొనసాగిస్తూ భవిష్యత్తులో మంచి ఉద్యోగం సంపాదించి, తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బాగా చూసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు యాదవ్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలు నివసించే ప్రాంతాల్లో దుప్పట్లు పంపిణీ, ఆహార పొట్లాలు, దుస్తులు అందజేయడంతో పాటు, పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ, స్కాలర్‌షిప్పులు ఇవ్వడం గొప్ప విషయం అని కొనియాడారు. సొసైటీ కార్యదర్శి పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా టెన్త్‌పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ కోశాధికారి ఆనంగి రాణి రుద్రమదేవి, అధ్యక్షుడు పాశం సర్దార్ అభినంద్ యాదవ్, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వర ప్రసాద్ యాదవ్, ఇంజినీర్ మాదాసు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు గణేష్, నరసింహారావు, ఆనంగి శ్రీనివాస్ యాదవ్, సభ్యులు వెంకటరత్న శోభ, మరియు శ్రీకృష్ణ అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన సుదర్శన, నారసింహ మహాయాగం



నగరంపాలెం: క్రేన్ రిలీజియస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంకిరెడ్డిపాలెంలో వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (పంచాయతన క్షేత్రం)లో ఈనెల 10 నుంచి 19 వరకు నిర్వహిస్తోన్న నవాహ్నిక నవకుండాత్మక శ్రీసుదర్శన, నారసింహ మహాయాగం ఆదివారంతో ముగిశాయి. ఈ క్రమంలో సాముహిక షష్టిపూర్తి మహోత్సవాలు, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, వేద ఆశీర్వచనం, ఉత్సవ పరిసమాప్తి చేపట్టారు. అనంతరం 200 మంది జంటలకు క్రేన్ సంస్థల అధినేత గ్రంధి వెంకటసత్యలక్ష్మీ కాంతారావు, లక్ష్మీహైమావతి ఆధ్వర్యంలో తాళి, మెట్టెలు, తాంబూలాలను అందజేశారు. గుంటూరు నగరంలోని పరిసర ప్రాంతాలతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లోని భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

పెదకాకాని: గంజాయి మత్తులో యువత జీవితాలు చిత్తు అవుతోంది. మత్తుకు బానిసలుగా మారి భవిష్యత్తు అంధకారం చేసుకుంటున్నారు. డిగ్రీలు చదివి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాల్సిన.. భావితరం వెర్రి తలలు వేసి మత్తులో జోగుతోంది. పుస్తకాల బ్యాగులతో కళాశాలలకు వెళ్తున్న వారిలో పలువురు యువకులు తరగతులకు డుమ్మా కొట్టి నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి గుప్పుమనిపిస్తున్నారు. ఈ గంజాయి ఒక్కో ప్రాంతంలో షార్ట్ కట్‌లో ఒక్కో పేరుతో పిలుస్తూ పక్క వారికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. ముఖ్యంగా నంబూరు వీవీఐటీ కళాశాల రోడ్డు, పెదకాకాని భ్రమరాంబపురం, రైల్వే ట్రాక్, గోరంట్ల పొలిమేర వంటి ముళ్ళ పొదలు, నిర్మానుష్య ప్రాంతాలకు చేరుతున్నారు. నలుగురు యువకులు ఒక చోటకు చేరడం సిగరెట్‌లో గంజాయి నింపి గుప్పుమనిపిస్తుంటే.. మరికొందరు లిక్విడ్ రూపంలో ఉన్న మత్తు పదార్థాన్ని ప్లాస్టిక్ షోడా బాటిళ్లలో నింపి దానికి ఏర్పాటు చేసిన రంధ్రం గుండా పీల్చడానికి గొట్టం మాదిరిగా ఏర్పాటు చేసుకుని ఆస్వాదిస్తున్నారు. ఈ మత్తులో తూగుతున్న యువత పలు సందర్భాల్లో విచక్షణ కోల్పోయి పలు ఘర్షణలకు కారణమవుతున్నారు. ప్రజలను కూడా భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ మత్తు పదార్థాల విక్రయాలు పెదకాకాని మండలంలోని పెదకాకాని, ఉప్పలపాడు, నంబూరు గ్రామాల్లో విక్రయిస్తూ పలువురు సొమ్ము చేసుకుంటున్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఈ గంజాయి మత్తు పదార్థాల కారణంగా ఎంతో ఘనంగా జరిపించిన పెళ్ళిళ్ళు కూడా మూన్నాళ్ల ముచ్చటగా ముక్కలవుతున్నాయి. అదుపు చేయాల్సిన పోలీసు సిబ్బంది బిజీగా ఉంటున్నారు. గంజాయి కేసులు కూడా మొక్కుబడిగానే నమోదు అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

గ్యాస్ట్రిక్ సమస్యను నిర్లక్ష్యం చేయరాదు

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి



మాట్లాడుతున్న ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందని, గ్యాస్ సమస్య నివారణ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని తెలుసుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి ఆధ్వర్యంలో లివర్, జీర్ణకోశ వ్యాధులపై జరిగిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ఎక్కువమంది ఎదుర్కొంటున్న గ్యాస్ట్రిక్ సమస్య ప్రమాదకరమైంది కాదన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు మీదకు వచ్చేంత గందరగోళానికి గురిచేస్తుందన్నారు. అన్నవాహిక, పొట్ట, చిన్నప్రేగులు, పెద్దప్రేగులు జీర్ణప్రక్రియలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. అన్నవాహికకు జీఈఆర్‌డీ సమస్య, కార్సినోమా సమస్య ఉత్పన్నమవుతాయని, ఈ సమస్యతో బాధపడేవారు పులుపు కలిగిన పండ్లను, చాక్లెట్లను, టమాట, వెల్లుల్లి, ఉల్లి, వేయించిన వస్తువులు, కూల్‌డ్రింక్స్, ఫ్యాటీ ఫుడ్స్, ఆల్కహాల్ వంటి వాటిని దూరం పెట్టాలన్నారు. తిన్న వెంటనే పడుకోరాదని, తక్కువ ఆహారం ఎక్కువ సార్లు తీసుకుంటే మంచిదన్నారు. బరువును అదుపులో ఉంచుకోవాలని, పొట్టలో యాసిడ్స్ ఎక్కువగా ఉత్పన్నమైతే స్టమక్ అల్సర్, స్టమక్ క్యాన్సర్‌కి దారితీస్తుందన్నారు. అనంతరం అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్ సిద్ధార్థ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్రరావు, శివ శంకర్‌రావు పాల్గొన్నారు.

భావసాహిత్య కవి డాక్టర్ రవూఫ్



పుస్తకావిష్కరణలో పాపినేని శివశంకర్, తదితరులు

నగరంపాలెం: భావ, సాహిత్య కవి డాక్టర్ రవూఫ్ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ప్రముఖ రచయిత డాక్టర్ రవూఫ్ రచించిన కవితా సంపుటి జాబిల్లి పుష్పం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. పుస్తకావిష్కరణ చేసిన డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ కవి తన కవిత్వం ద్వారా తాను చెప్పదలుచుకున్న భావాలను సూటిగా హృదయాలను తాకేలా ఉండాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుప్రసిద్ధ కవి డాక్టర్ ఇస్మాయిల్ వారసునిగా గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ ప్రస్థానంలో డాక్టర్ రవూఫ్‌కు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ప్రముఖ రచయిత కాట్రగడ్డ దయానంద్, ఏపీ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి మాట్లాడుతూ కవితా సంపుటి జాబిల్లి పుష్పంలో జాబిల్లి అనేకానేక శాఖల పుష్పంగా మారి గుబాళిస్తున్నాయని అన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని, పలువురు రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యం



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో మండపాటి శేషగిరిరావు, శామ్యూల్‌రెడ్డి, అంజిరెడ్డి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి వ్యక్తి తనలోని శక్తి, యుక్తులపై ఆత్మ విశ్వాసాన్ని కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మండపాటి శేషగిరిరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆదివారం స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషగిరిరావు మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, మనపై మనకు నమ్మకాన్ని పెంపొందించుకోవడం ద్వారా అనుకున్న రంగంలో విజయాన్ని సాధించగలరని అన్నారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో 10వేల మందికి శిక్షణ కల్పించడం ద్వారా అనేక మందిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఫౌండేషన్ డైరెక్టర్ అంజిరెడ్డి, శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ బోధనా నైపుణ్యాలు అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు సీబీఎస్ఈ పాఠ్యాంశాల బోధనా నైపుణ్యాలు అలవర్చుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో 10వ తరగతి సీబీఎస్ఈ సిలబస్‌లో నూతన పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సీబీఎస్ఈ సిలబస్ అమల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి టెన్త్‌లో నూతన పాఠ్యాంశాలు వస్తున్నాయని చెప్పారు. ఆయా పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా బోధన మెరుగుపడుతుందని అన్నారు. చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మారిన పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకుని, బోధనలో తమదైన శైలిలో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ-అభ్యాస్ అకాడమీ చైర్మన్ ఫణి పవన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని అన్నారు. జన విజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే విధంగా బోధన ఉండాలని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్‌తో పాటు సోషల్, జీవ, భౌతికశాస్త్ర, ఆంగ్ల రీసోర్స్ పర్సన్లు కుర్రా శ్రీనివాస్, సీహెచ్ వీరప్పయ్య, ఆర్.శివనాగేశ్వరరావు, చావా శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ



పేదలకు పెన్షన్లు అందజేస్తున్న పాండురంగ సురేష్, సతీష్, అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం పేదలకు నెలవారీ పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్యాపిటల్ బ్యాంక్ సీఈఓ పాండురంగ సురేష్ మాట్లాడుతూ 108 మంది పేదలకు ప్రతినెలా రూ.500 చొప్పున పెన్షన్లతో పాటు నూతన వస్త్రాలను బహూకరించడం అభినందనీయమన్నారు. అవోపా అందిస్తున్న సేవలకు తన వంతు చేయూత అందిస్తానని చెప్పారు. పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించడం మంచి పరిణామమని అన్నారు. ఆర్థిక రంగ నిపుణుడు కేఎహెచ్‌వీ సతీష్ మాట్లాడుతూ పేదవారు తమ కాళ్లపై తాము నిలబడేటట్లు అవోపా ద్వారా చేయూతనివ్వడం అభినందనీయమని అన్నారు విదేశాలకు వెళ్లి చదువు కోవాలనే పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కన్వీనర్ మద్ది సాయి రమేష్, వెంకటరావు, కాళాంగి శ్రీనివాసరావు, ఆనందరాజు, జనార్ధన రావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా షాపులకు నోటీసులు అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో వున్న బాణసంచా షాపులకు ఆదివారం తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నోటీసులు అందజేస్తున్నామని, జూన్ 4వ తేదీ వెలువడే పార్లమెంట్, అసెంబ్లీ ఫలితాలు రానున్నాయని, ఆ సందర్భంగా బాణసంచా పెద్ద మొత్తంలో అమ్మకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, దానిలో భాగంగా ఉండవల్లిలో వున్న హోల్‌సేల్ బాణసంచా దుకాణాలకు ఈ నోటీసులు అందజేశామని, జూన్ 4వ తేదీ పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదని, పెట్రోల్ బంకుల వారు పెట్రోల్,డీ జిల్‌ను క్యానుల్లో, బాటిళ్లలో అమ్మకూడదని ఆయన సూచించారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజలు గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్ అన్నారు. మండలంలోని వేజండ్ల, నారాకోడూరు తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.మహేష్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున, తర్వాత ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతవరణం కొనసాగించాలని సూచించారు. మండల పరిధిలోని మంచాల, చేబ్రోలు, నారాకోడూరు, వేజండ్ల, వడ్లమూడి, గ్రామాల పరిధిలోని పెట్రోలు బంకు యజమానులకు డబ్బాలు, బాటిల్స్, విడిగా ఇతర వస్తువులలో పెట్రోలును నింపి విక్రయాలు చేయవద్దని ఆదేశించారు. బంకు యజమానులకు నోటీసులు అందజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యేవరకు కేవలం వాహనదారులకు మాత్రమే పెట్రోలు, డీజిల్‌ను నింపాలని సూచించారు. ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

చిలువూరులో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ఆదివారం రాప్స్ బాండ్స్ ఆఫ్ లవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొప్పుల అనిల్ బాబు జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ శిబిరంలో 130 మందికి గుండె సంబంధిత వ్యాధులకు, ఎముకలు, కీళ్లు, సాధార వ్యాధులు, క్యాన్సర్ నిర్ధారణ, కంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. షుగర్, బీపీ, ఊపిరితిత్తుల పనితీరు, ఎకో, ఈసీజీ వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొప్పుల మరియమ్మ, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య ఉచిత శిబిరం



గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు త్వరితగతిన నయమవుతాయని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన వైద్యంలో ఆయుర్వేద వైద్యం ప్రఖ్యాతిగాంచిందన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వైద్యం అందజేస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 పడకలతో ఆయుర్వేద వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి, అర్హులకు రూ.60 వేలు విలువైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.